## సమ్మక్క-సారలమ్మ జాతర



సారలమ్మ గద్దె వద్ద పూజలు చేస్తున్న పోతరాజులు

ముథోల్, ఫిబ్రవరి 21 : మండలంలోని ఎడ్‌బిడ్ తండాలో సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కనకవనం నుంచి సారలమ్మను డప్పు వాయిద్యాల నడుమ పోతరాజుల విన్యాసాలతో తీసుకవచ్చి గద్దెపై ప్రతిష్ఠించారు. అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బంగారం (బెల్లం) సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

## అక్కకొండ బ్రహ్మోత్సవాలు ప్రారంభం..



దిల్దార్‌నగర్ గుట్టపైన లక్ష్మీనరసింహస్వామి ఆలయం

కడెం, ఫిబ్రవరి 21 : కడెం మండలం దిల్దార్‌నగర్ సమీపంలోని అరణ్య ప్రాంతంలో గల కొండగుహలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగవైభవంగా ప్రారంభమయాయయి. నాలుగు రోజుల పాటు కొనసాగే ఈ ఉత్సవాలకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. 25వ తేదీ వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. బుధవారం స్వామి వారి కళ్యాణ మహోత్సవం, అన్న ప్రసాద వితరణ, 22న చందరోత్సవం, నిత్య పూర్ణహుతి, తీర్థప్రసాద గోష్ఠి, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం, 23న శ్రీ లక్ష్మీ అమ్మవారి సహస్ర నామార్చన, కుంకుమార్చన, రాత్రి దోపు ఉత్సవాలు, 24న బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైన జాతర, రథోత్సవం, అలాగే పౌర్ణమి రోజున రాత్రి జాతర మహోత్సవం అనవాయితీగా వస్తున్నది. 25న ప్రత్యేక పూజా కార్యక్రమాలతో జాతర మహోత్సవం ముగుస్తుంది. బుధవారం సాయంత్రం దిల్దార్‌నగర్, ఎలగడప గ్రామాల్లో శ్రీ లక్ష్మీనరసింహుల పల్లకీసేవ శోభాయమానంగా సాగింది. భక్తుల సౌకర్యం కోసం అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే 22వ తేదీన సర్వగ్రహ నివారణార్థమైమైన తిరుమమంజునం, చందనోత్సం నిత్య హోమం, బలిహరణం. అలాగే సాయంత్రం కుంకుమార్చన, నిత్యహోమం, బలిహరణం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. జాతర మహోత్సవానికి నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలతో పాటు, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలిరానున్నారు.

## జాబ్ మేళా సద్వినియోగం చేసుకోండి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 21 : ఇంటర్ సెకండియర్ ఎంపీసీ, ఎంఈసీ చదువుతున్న విద్యార్థులకు హెచ్‌సీఎల్-టెక్ బీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని శాంతినగర్ కాలనీ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి పరశురాం తెలిపారు. సాఫ్ట్‌వేర్ రంగంలోని జాబ్ కోసం ఎంపీసీ, ఎంఈసీలో 75 శాతం మార్కులు, గణితంలో 60 శాతం మార్కులు పొందిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. సంబంధిత ధ్రువపత్రాలు, ఆన్‌రైడ్ ఫోన్‌తో జాబ్ మేలాకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు 94935 53821, 80740 65803 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# కేసీఆర్ హయాంలోనే ఆలయాలకు పునరుజ్జీవం

- ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి
- కస్ర గ్రామంలో ఎండోమెంట్ నిధులు రూ.32 లక్షలతో ఆలయ నిర్మాణం



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్ రెడ్డి

కుభీర్, ఫిబ్రవరి 21 : పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ హయాంలో శిథిలావస్థకు చేరిన హిందూ ఆలయాలతో పాటు నూతన ఆలయాలు పురుడు పోసుకున్నాయని ముథోల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు గడ్డిగారి విఠల్‌రెడ్డి అన్నారు. మండలంలోని కస్ర గ్రామంలో రూ.32 లక్షల ఎండోమెంట్ నిధులతో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన, కలశపూజ, శిఖర పూజ కనుల పండువగా నిర్వహించారు. ముందుగా ఆష్టా బ్రహ్మచారి, భైంసా పూజారుల బృందం హోమం, ప్రాణ ప్రతిష్ఠ, అభిషేకం కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. తాలుకాలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎండోమెంట్ నిధులు రూ.వందల కోట్లు వెచ్చించి, ప్రజల్లో భక్తి విశ్వాసాలను పెంపొందింపజేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కుభీర్‌తో పాటు గిరిజన తండాలు, గ్రామాల్లో కళ్యాణ మండపాలు నిర్మించామని గుర్తు చేశారు. అనంతరం విఠల్ రెడ్డిని ఆలయ, వీడీసీ సభ్యులు సత్కరించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు తిప్ప జగదీశ్, సింధే సంతోష్ పటేల్, వడ్నం ముత్యం, రాజేందర్, తిప్ప నవీన్, వడ్నం ప్రవీణ్ కుమార్, ఎంపీపీ తూము లక్ష్మి, వైస్ ఎంపీపీ మోహియొద్దీన్, పార్టీ మండలాధ్యక్షుడు ఎన్నీల అనిల్, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, సహకార చైర్మన్ గంగా చరణ్, శంకర్ చౌహాన్, కందూరి సంతోష్, బొప్ప నాగ లింగం, దత్తహరి, సూది రాజన్న, కళ్యాణ్ పాల్గొన్నారు.

### మీ తోనే ఉంటా.. అధైర్య పడొద్దు..

అలాగే కుభీర్ ఎంపీటీసీ పోసానిబాయి ఇంటికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. అనంతరం అక్కడే నాయకులతో సమావేశం నిర్వహించారు. గెలిచినా, ఓడినా ప్రజల మధ్య ఉండేవారే నిజమైన నాయకులన్నారు. ఎల్లవేళలా ప్రజాసేవలోనే ఉంటానని, ప్రజల్లో ఒకడిగా ఉంటానని స్పష్టం చేశారు. పదేళ్లలో తాలుకాను ఊహించని విధంగా అభివృద్ధి చేసి చూపించామన్నారు. ప్రజల తీర్పు శిరసావహించాలని తెలిపారు.

# వీడ్కోలు సమావేశాలు..

కుంటాల, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో బుధవారం 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. సీనియర్ విద్యార్థులు తమ సమయ అనుభవాన్ని, గత రోజులను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

### లోకేశ్వరం జూనియర్ కళాశాలలో..

లోకేశ్వరం, ఫిబ్రవరి 21 : లోకేశ్వరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఫేర్‌వెల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలతో అలరించారు. కళాశాలలో తమ ఉపాధ్యాయులతో తోటి విద్యార్థులతో ఉన్న అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తుకారాం, లెక్చరర్లు కారేగాం వినోద్, సాయినాథ్, చిన్నయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



లోకేశ్వరం కళాశాలలో విద్యార్థుల నృత్యం

### దస్తురాబాద్ కేజీబీవీలో..

దస్తురాబాద్, ఫిబ్రవరి 21 : దస్తురాబాద్ కేజీబీవీలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు అలరించాయి. ఎస్‌వో తిరుమల మాట్లాడుతూ.. విద్యతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాలను నిర్దేశించుకొని, చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



దస్తురాబాద్ : నృత్యం చేస్తున్న విద్యార్థులు




కుంటాల : ఆదర్శ పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

# ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

దస్తురాబాద్, ఫిబ్రవరి 21 : అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ సూచించారు. తహసీల్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో రమేశ్‌తో కలిసి అక్రమ ఇసుక రవాణాపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇసుక రవాణాపై పంచాయతీ కార్యదర్శులు నిఘా పెట్టాలని, అలాగే అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకోవాలని ఆదేశించారు. ప్రతి ఒక్క పంచాయతీలో అక్రమ ఇసుక రవాణాపై దండోరా వేయించాలని సూచించారు. ఇసుక అవసరం ఉన్నవారు చలాన్ చెల్లించి, అనుమతితో తీసుకెళ్లాలని తెలిపారు. లేకపోతే అక్రమంగా ఇసుక తరలిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ యాదవ రావు, ఎంపీవో అనిల్ కుమార్, ఆర్ఐ గంగన్న, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్ →



## తహసీల్దార్‌కు సన్మానం



తహసీల్దార్ సుధాకర్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మామడ, ఫిబ్రవరి 21 : మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జీ సుధాకర్‌ను బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండ్ర రాజారెడ్డి, ఏలేటి చిన్నారెడ్డి, నవీన్‌కుమార్, రంజిత్, సురేందర్‌గౌడ్, దువ్వేందర్, ఆశన్న, సురేందర్ తదితరులు ఉన్నారు.

## నేడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 21 : స్వాతంత్ర్య సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ 66వ వర్ధంతి వేడుకలను గురువారం నిర్మల్ పట్టణంలోని మౌలానా అబుల్ కలాం ఆజాద్ చౌరస్తాలో నిర్వహిస్తున్నట్లు కలాం గుణం ఎడ్యుకేషన్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్ బుధవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

## 1వ తేదీన వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న సురేశ్

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 21 : తెలంగాణ ఆశ వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ప్రతి నెలా 1న వేతనాలు అందించాలని సీఐటీయూ ఆశావర్కర్ల గౌరవ అధ్యక్షురాలు సుజాత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేశ్ అన్నారు. నిర్మల్‌లో బుధవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆశా వర్కర్లతో ప్రభుత్వం వైద్యానికి సంబంధించిన అన్ని సేవలను వినియోగించుకుంటున్నప్పటికీ వారికి వేతనాలు చెల్లించడంలో జాప్యం చేయడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు గంగామణి, సరిత, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

## మతోన్మాదం ప్రమాదకరం

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 21 : దేశంలో పెట్టుబడిదారీ, దోపిడీవర్గంతో పాటు మతోన్మాదం ఎంతో ప్రమాదకరమని, రూపుమాపేందుకు అన్ని శక్తులు ఏకం కావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్ అన్నారు. నిర్మల్‌లోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం రెడ్‌బుక్ డే సందర్భంగా మతోన్మాద ప్రమాదంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా దేశంలో అధికారంలో ఉన్న ఓ పార్టీ మతతత్వ రాజకీయాలకు పాల్పడుతూ మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నదని ఆరోపించారు. దీంతో దేశానికి అన్ని విధాలా నష్టమన్నారు. ప్రజలందరూ ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజాస్వామ్య లౌకికవాదంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేశ్, శంబు, పోశెట్టి, అతిక్, దిగంబర్, ఫసియుద్దీన్ పాల్గొన్నారు.

## షాపింగ్ కాంప్లెక్స్‌కు వేలం

నిర్మల్ టౌన్, ఫిబ్రవరి 21 : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న ఎస్సీ కాంప్లెక్స్‌లోని 3, 5, 10 షాపింగ్ గదులను అద్దె ఇచ్చేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హన్మండ్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దె కావాల్సిన వారు ఎస్సీలై ఉండాలని పేర్కొన్నారు. రూ.5 వేల డీడీతో పాటు రూ.50 వేల డిపాజిట్‌తో ఈ నెల 29 వరకు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

## ఆలయంలో హోమం

భైంసా, ఫిబ్రవరి 21 : పట్టణంలోని సంతోషిమాత వార్షికోత్సవం సందర్భంగా హోమం నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నందుభయ్యా, పాపేష్, పండితులు బబ్రు మహారాజ్ పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

ఖానాపూర రూరల్, ఫిబ్రవరి 21 : ఖానాపూర్ మండలం గోసంపల్లె గ్రామానికి చెందిన రేవెళ్ల నారాయణ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబానికి జై జవాన్-జై కిషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5వేలు సాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో కొండేరి దినేశ్, నాశాని మల్లేశ్, నాగమొగలి, కిరణ్, శ్రావణ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## నిజాయితీ చాటుకున్న వాగ్దేవి సిబ్బంది

బాసర, ఫిబ్రవరి 21 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఓ భక్తుడు తన మొబైల్ ఫోన్ పోగొట్టుకోగా, గుర్తించిన వాగ్దేవి సిబ్బంది అతనికి అందజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడకు చెందిన రమణారెడ్డి బుధవారం అమ్మవారి దర్శనానికి వచ్చారు. నిత్యాన్నదాన సత్రంలో మొబైల్ మర్చిపోయాడు. విధుల్లో ఉన్న వాగ్దేవి సిబ్బంది భూమన్న గుర్తించి అప్పగించాడు.

## సీసీరోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ

సారంగాపూర్, ఫిబ్రవరి 21 : మండలంలోని బోరిగాం గ్రామంలో బుధవారం రూ.6లక్షలతో సీసీ రోడ్డు, రూ.2 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులకు జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి భూమి పూజ చేశారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఉపాధి హామీ ద్వారా నిధులు విడుదల చేస్తున్నదన్నారు. ఇందులో నాయకులు దశరథ రాజేశ్వర్, బొల్లోజీ నర్సయ్య, ఏనుగు ముత్యంరెడ్డి, కొత్తపెల్లి విలాస్‌రావు, పడిగెల అశోక్, జెడ్ల శ్రీనివాస్, పోతన్న, కట్కూరి లచ్చన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.



పనులకు భూమిపూజ చేస్తున్న జడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి

## రాష్ట్రస్థాయి సైన్స్ ట్యాలెంట్ టెస్ట్‌కు ఎంపిక



నిర్మల్ అర్బన్ : రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులు

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 21 : నిర్మల్ పట్టణంలో మంగళవారం నిర్వహించిన సైన్స్ ట్యాటెంట్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి టెస్ట్‌కు ఎంపికైనట్లు జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఖానాపూర్ జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన దాసరి పల్లవి, మహాత్మా జ్యోతి బాపూలే భైంసా గురుకులానికి చెందిన పీ నగేశ్, లోకేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏ చందన, దిలావర్‌పూర్‌కు చెందిన సుమిత్, కొరిటికల్ జడ్పీ పాఠశాలకు చెందిన ఎం రాజు ప్రతిభ చూపారని పేర్కొన్నారు. వీరు త్వరలో హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

లక్ష్మణచాంద, ఫిబ్రవరి 21 : మండలంలోని వడ్యాల్ ఉన్నత పాఠశాల విద్యార్థి నైనం శృతిక జిల్లా స్థాయి సైన్స్ టాలెంట్ పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపినట్లు హెచ్ఎం అశోక్ కుమార్‌వర్మ తెలిపారు. జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించిన సైన్స్ ప్రతిభా పావ పరీక్షలో ఉత్తమ ప్రతిభ చూపి డీఈవో రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా కన్సోలేషన్ బహుమతి అందుకున్నట్లు పేర్కొన్నారు. ఆమెకు డీఈవో ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేశారు.

## ఈవీఎంలపై ప్రజలకు అవగాహన

పెంబి, ఫిబ్రవరి 21 : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో తహసీల్దార్ లక్ష్మణ్ ఈవీఎంల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. సమర్థవంతమైన నాయకులను ఎన్నుకోవడానికి ఓటు వజ్రాయుధం వంటిదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తప్పనిసరిగా తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



పెంబిలో ఈవోఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కుంటాల, ఫిబ్రవరి 21 : కుంటాల మండల ఓలా గ్రామ శివారులోని వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని రూ.5వేల జరిమానా విధించినట్టు తహసీల్దార్ అహ్మద్ ఖాన్ తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

## గోడం నగేశ్ పరామర్శ


కుభీర్, ఫిబ్రవరి 21 : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ గోడం నగేశ్ బుధవారం రాత్రి కుభీర్ మండలం ధార్‌కుభీర్‌లో మాజీ సర్పంచ్ తోకల మారుతిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మండలానికి చెందిన ఆయా పార్టీల నాయకులతో సమావేశమై వచ్చే పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో పలు విషయాల గురించి చర్చించారు. ఈయన వెంట మాజీ ఎంపీటీసీ నర్సప్ప, రాజురా బాబన్న, పంతుల దేవేందర్, నాగేందర్, గంగాధర్, ధర్మన్న, కనకయ్య కార్యకర్తలు ఉన్నారు.



ధార్‌కుభీర్‌లో నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ గోడం నగేశ్

## నేడు విగ్రహ ప్రతిష్ఠాపన

సారంగాపూర్, ఫిబ్రవరి 21 : సారంగాపూర్ మండలం జామ్ గ్రామంలోని పెద్దూర్‌లో రూ.కోటితో నిర్మించిన పట్టాభిరామాలయ ప్రారంభోత్సవం గురువారం నిర్వహిస్తున్నట్లు వీడీసీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం ప్రాతఃకాల పూజలు, గర్తన్యాస, ధాతున్యాస, బీజన్యాస, రత్ననాసములు, పీఠదేవతా పూజలు, స్థాపిత దేవతాహవనములు, పుష్యమీ నక్షత్రయుక్త ధనుర్ లగ్నసుముహూర్తమున శ్రీ సభా సమేత పట్టాభి సీతారామచంద్రులస్వామి, ఆంజనేయ గరుత్మంత, నవగ్రహ, ధ్వజశిఖర యంత్ర మూర్తి స్థిర విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సందర్భంగా బుధవారం వీడీసీ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు.



కొత్తగా నిర్మించిన శ్రీ పట్టాభిరామాలయం

## అభివృద్ధి పనులకు భూమిపూజ

కుభీర్, ఫిబ్రవరి 21 : కుభీర్‌తో పాటు మండలంలోని చొండి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.11.20లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే బోస్లే నారాయణ్‌రావు పటేల్ ప్రారంభించారు. ముందుగా ఎంపీపీ తూము లక్ష్మి పనులకు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మోహియొద్దీన్, సీనియర్ నాయకులు ఓంప్రకాశ్ లడ్డా, డాక్టర్ పీ శివురాం, గంగాధర్ పటేల్, సిద్దంవార్ వివేకానంద, జావీద్, కూనింటి దేవేందర్, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## బుడుందేవ్ జాతర ప్రారంభం



పూజలు చేస్తున్న భక్తులు

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 21 : శ్యాంపూర్ గ్రామంలో వెలసిన బుడుందేవ్‌కు మెస్రం వంశీయులు ఈ నెల 15వ తేదీన పూజలు చేశారు. బుధవారం జాతర ప్రారంభించారు. ఇక్కడికి చుట్టు పక్కల మండలాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం జాతరలో కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★హైదరాబాద్‌లో అర్జెంటుగా కొండాపూర్‌కి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం, భోజనం, వసతి కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-313897-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677